
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 25 నవంబరు 2024



పొంచి ఉన్న వాయు'గండం'

● రాష్ట్రానికి భారీ వర్షసూచన

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం సోమవారం వాయుగుండంగా మారి తీరంవైపు దూసుకురానుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. దక్షిణ అండమాన్ సముద్రప్రాంతం, ఈశాన్య సముద్ర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా భూమధ్యరేఖకు సమీపంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం వేకువజాము 5.30 గంటలకు మరింత బలపడింది. సోమవారం ఈ అల్పపీడనం మరింత ముందుకు కదులుతూ దక్షిణ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా మారనుంది. ఈ నెల 27న శ్రీలంక తీరం వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ వాయుగుండానికి 'ఫీన్‌జల్' అని నామకరణం చేశారు. ఈ వాయుగుండం ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీలలో సముద్రతీర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ వాయుగుండం వల్ల ఈ నెల 28 వరకు రాష్ట్రంలో పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి.

డెల్టా జిల్లాల్లో అప్రమత్తం...

బంగాళాఖాతంలో అల్ప పీడనం సోమవారం వాయుగుండంగా మారనుండటం, ఈశాన్య రుతుపవనాలు మూడో విడతగా బలపడనుండటంతో డెల్టా జిల్లాల్లో భారీగా వర్షాలు కురువనున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు, ప్రైవేటు వాతావరణ సంస్థల నిర్వాహకులు ప్రకటించారు. సోమవారం మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. మంగళవారం కడలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, పుదుకోట జిల్లాల్లో కొన్ని చోట్ల భారీగా వర్షాలు కురుస్తాయి. బుధవారం తిరువళ్లూరు, రాణిపేట, కాంచీపురం, చెంగల్పట్టు, చెన్నై జిల్లాల్లో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. 28న కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, రాణిపేట, తిరువణ్ణామలై, చెన్నై జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటిగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

చేపలవేటకు వెళ్లొద్దు ....

బంగాళాఖాతంలో వాయుగుండం, ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల సముద్ర తీర జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 35 నుండి 45 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయని, అలల తాకిడి ఉధృతంగా ఉంటాయన్నారు.

అదే విధంగా చెన్నై నుంచి రామనాథపురం వరకు సముద్రతీర జిల్లాల్లో ఈ నెల 26 నుంచి 28 వరకు భారీగా వర్షాలు కురవనున్నాయి. సోమవారం మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు జిల్లాల్లో, మంగళవారం కడలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, పుదుకోట జిల్లాల్లోనూ కుండపోతగా వర్షాలు కురుస్తాయి. దీంతో జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. రాజధాని నగరం చెన్నై పరిసర ప్రాంతాలకు సంబంధించినంతవరకు ఆకాశం మేఘావృతమై పలు చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తాయి. మంగళవారం నగరంలో ఓ మోస్తరుగా వర్షం కురిసే అవకాశంకూడా ఉంది.

ద్రావిడ సిద్ధాంతాలకే పట్టం

● డీఎంకే ఎంపీ కనిమొళి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న సీఎం స్టాలిన్, ఎంపీ కనిమొళి తదితరులు

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ సిద్ధాంతాలకే రాష్ట్ర ప్రజలు పట్టం కడతారని డీఎంకే ఎంపీ కనిమొళి స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం అన్నాసాలైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శనివారం రాత్రి ఎంపీ కనిమొళి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సీఎం స్టాలిన్ హాజరై విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కనిమొళి మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై ప్రారంభించిన డీఎంకే ద్రావిడ సిద్ధాంతాలను అనుసరిస్తూ అటు రాజకీయాల్లోను, ఇటు అధికారంలోనూ అగ్రస్థానంలో రాణిస్తోందన్నారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మోడల్ ప్రభుత్వం ద్రావిడ సంస్థ సాధనలు, అభివృద్ధి పనులు, భావితరాలకు చేరాలన్న దృక్పథంతోనే కలైంజర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. కలైంజర్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.10 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.6 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.3 లక్షలు చొప్పున అందజేసినట్లు కనిమొళి తెలిపారు.

మావటి కుటుంబాలకు ప్రభుత్వ సాయం

● రూ.10లక్షల చొప్పున అందజేసిన మంత్రి పీకే శేఖర్ బాబు



మావటి ఉదయకుమార్ కుటుంబీకులకు రూ.10లక్షల చెక్కును అందజేస్తున్న దేవాదాయ శాఖ మంత్రి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు ఆలయ ఏనుగు దైవానై దాడిలో మృతి చెందిన మావటి ఉదయకుమార్, అతడి బంధువు శిశుపాలన్ కుటుంబీకులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయాన్ని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆదివారం ఉదయం అందజేశారు. ఈ నెల 18న ఏనుగు దగ్గర సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన శిశుపాలన్‌ను, ఆయనను కాపాడేందుకు వచ్చిన మావటి ఉదయకుమార్‌పై ఆ ఏనుగు దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్ మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం ప్రకటించి, ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ మేరకు ఆదివారం ఉదయం తిరుచెందూరు వెళ్ళిన మంత్రి పీకే శేఖర్‌బాబు మావటి ఉదయకుమార్, ఆయన బంధువు శిశుపాలన్ కుటుంబీకులను కలుసుకుని తలా రూ.10లక్షల చొప్పున అందజేశారు. మావటి ఉదయకుమార్ భార్య రమ్య, శిశుపాలన్ కుమార్తె అక్షయకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. అంతకు ముందు మంత్రి శేఖర్‌బాబు తిరుచెందూరు ఆలయం వద్ద ఏనుగు దైవానైని పరిశీలించారు. అనంతరం ఆలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మావటి ఉదయకుమార్ సతీమణికి ఆమె విద్యార్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. ఉదయకుమార్ పిల్లల విద్యా ఖర్చులను మంత్రి అనితా రాధాకృష్ణన్, ఎంపీ కనిమొళి భరించేందుకు అంగీకరించారని చెప్పారు. అదే విధంగా శిశుపాలన్ కుటుంబీకులను కూడా ఆర్థికపరంగా ఆదుకుంటామని చెప్పారు. మావటిపై దాడి జరిపి ఆయన మృతి కారణమయ్యాననే దిగులుతో ఆలయ ఏనుగు దైవానై మూడు రోజులపాటు పస్తులతో గడిపిందని, ప్రస్తుతం ఆ ఏనుగు సాధారణ స్థితికి చేరుకుందన్నారు. ఈ సంఘటన దరిమిలా రాష్ట్రంలో 28 ఆలయాలకు ఏనుగుల సంరక్షణకు ప్రభుత్వం కొత్త విధివిధానాలను అమలులోకి తెచ్చిందని, ఆలయ ఏనుగులు స్నానం చేయడానికి నీటి గుంతలు, స్విమ్మింగ్ పూల్స్ నిర్మించాలని ఆదేశించిందని తెలిపారు.

రాష్ట్రంలో పొత్తు లేకుండా ఏ పార్టీ అధికారంలోకి రాదు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ పొత్తు లేకుండా ప్రభుత్వం ఏర్పాటుచేయడం సాధ్యం కాదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం ఐఎన్‌టీయూసీ 99వ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో సెల్వపెరుందగై పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలను అందజేసి మాట్లాడుతూ... 2006వ సంవత్సరం కరుణానిధి నాయకత్వంలోని ప్రభుత్వానికి మెజార్టీ తగ్గినప్పుడు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చి ఆ పార్టీని నిలబెట్టిందని, అయినప్పటికీ ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్‌కు వాటా కోరలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఏర్పడిన పెనుమార్పుల వల్ల పార్టీల పరిస్థితులు తారుమారు అయ్యాయని, రాబోయే రోజుల్లో పొత్తు లేకుండా డీఎంకే, అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటుచేయలేవని ఆయన అభిప్రాయపడ్డారు.

అన్నాడీఎంకే బ్రహ్మాస్త్రం

రెండాకుల గుర్తు

● వీడియో సందేశంలో రజనీకాంత్



చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బ్రహ్మాస్త్రం రెండాకులు గుర్తేనని మాజీ ముఖ్యమంత్రి జానకి రామచంద్రన్ పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశారని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ సతీమణి జానకిరామచంద్రన్ శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఆ వేడుకల్లో పాల్గొంటున్న పార్టీ శ్రేణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈ వేడుకలకు తనను ఆహ్వానించిన మాజీ మంత్రి కడంబూరు రాజుకు ధన్యవాదాలని చెప్పారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ మరుదనాట్టు ఇలవరసి చిత్రంలో నటిస్తున్నప్పుడు జానకితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమవివాహానికి దారి తీసిందన్నారు. సినిమాల్లో మంచి ఛాన్సులు వచ్చినా వదలుకుని ఎంజీఆర్‌ని కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారని, రామావరం గార్డెన్ ఎవరు వెళ్ళినా భోంచేయకుండా తిరిగి రారని, రోజూ 300ల మందికి ఆమె శాఖాహారం, మాంసాహారం వడ్డించేవారని రజనీకాంత్ కొనియాడారు. ఎంజీఆర్ మృతి చెందిన తర్వాత జానకి రామచంద్రన్ ప్రమాదవశాత్తూ రాజకీయాల్లో వచ్చారని, ఆ తర్వాత పార్టీ రెండు ముక్కలైనప్పుడు రాజకీయాలకు స్వస్తి చెప్పి జయలలితకు పార్టీ బాధ్యతలను పూర్తిగా అప్పగించి త్యాగశీలిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. జానకి రామచంద్రన్‌ను తాను మూడు సార్లు కలుసుకున్నానని, రాఘవేంద్ర చిత్ర నిర్మాణ సమయంలో, ఆమె ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఓ షూటింగ్‌లో ఉన్నప్పుడు ఇద్దరూ కలుసుకున్నామని, ఆ స్వయంగా తయారు చేసి ఇచ్చి కాఫీ రుచి తనకింకా గుర్తుందన్నారు. సినిమాల్లో తాను ధూమపానం చేసే దృశ్యాలు అధికంగా ఉన్నాయని, అవి లేకుండా చూసుకోమని ఎంజీఆర్ సలహా ఇచ్చినట్లు జానకి రామచంద్రన్ చెప్పారని రజనీకాంత్ అన్నారు. రెండాకుల చిహ్నం ఎల్లప్పుడూ అన్నాడీఎంకేకు బ్రహ్మాస్త్రంలా ఉంటోందని చెప్పారు. జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఎడప్పాడి పళనిస్వామికి పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు రజనీ తన ప్రసంగాన్ని ముగించారు.

నకిలీ యాప్‌తో మోసాలు

● హెచ్చరించిన సైబర్ క్రైం పోలీసులు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'పీఎం కిసాన్ యోజన' అనే నకిలీ యాప్ వినియోగించి యూపీఐ ద్వారా నగదు మోసానికి పాల్పడుతున్నారని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై సైబర్ క్రైం పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో... 'ఫోన్ పే' తదితర యూపీఐ వినియోగించి మోసపూరిత బ్యాంకింగ్ లావాదేవీలు అధికమవుతున్నాయన్నారు. యూపీఐ ద్వారా ఖాతాదారులకు తెలియకుండానే నగదు మోసానికి పాల్పడుతున్నారన్నారు. ఈ వ్యవహారంపై ఏడు ఫిర్యాదులందాయన్నారు. ఫిర్యాదు దారుల బ్యాంక్ ఖాతాల నుంచి 'అమెజాన్ పే' యాప్ ద్వారా నగదు బదిలీ అయిందని గుర్తించామన్నారు. ఈ అనధికార లావాదేవీలపై జరిపిన విచారణలో 'పీఎం కిసాన్ యోజన' అనే మోసపూరిత యాప్ వినియోగిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ యాప్ వివిధ ఛానళ్ళ, వాట్సాప్ గ్రూపుల ద్వారా షేర్ చేయబడుతుందని తెలిపారు. ఇది వినియోగదారుల ఎస్‌ఎంఎస్ వినియోగాన్ని, పరికర క్రియాశీలతను పరిమితం చేయగలదన్నారు. మోసగాళ్ళు ఎస్‌ఎంఎస్ ట్రాఫిక్ అడ్డగించి, యూపీఐ అప్లికేషన్ మార్చడానికి దాన్ని ఉపయోగిస్తారని వివరించారు. మోసపూరితంగా సేకరించబడిన డేటాతో, వారు దానిని యూపీఐ యాప్‌ల్లో ఉపయోగించి, అనధికారిక లావాదేవీలు చేస్తున్నారన్నారు. ఈ యాప్ వెబ్‌సైట్ నుంచి పేరు, ఆధార్ నెంబర్, పాన్, పుట్టిన తేది వంటి వ్యక్తిగత డేటాను తస్కరిస్తుందన్నారు.



ఈ అధునాతన మోసం దాడి చాలా మందిని ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీస్తోందన్నారు. ప్రజలు తమ బ్యాంక్ ఖాతాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ఏదైనా అనధికార నగదు బదిలీ గుర్తిస్తే వెంటనే బ్యాంక్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే, గుర్తుతెలియని లింక్‌లపై 'క్లిక్' చేయడం, అనవసర మెసేజ్‌లు, ఈ-మెయిల్స్‌కు రిప్లై ఇవ్వడం వంటివి నివారించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యూపీఐ, డేటా, ఓటీపీ నెంబరు ఎవరికి చెప్పొద్దని, సైబర్ నేరాలపై '1930' అనే నెంబరు, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం పోలీసులు తెలియజేశారు.

జానకి త్యాగం మరువలేనిది

● శతజయంతి వేడుకల్లో ఎడప్పాడి పళనిస్వామి



మాజీ సీఎం జానకి రామచంద్రన్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఎడప్పాడి

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ ప్రారంభించిన అన్నాడీఎంకే రెండుగా విడిపోయిన సమయంలో పార్టీ సమైక్యత కోసం రాజకీయాల నుంచి తప్పుకున్న జానకి రామచంద్రన్ త్యాగం మరువలేనిదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కొనియాడారు. స్థానిక వానగరంలో ఆదివారం జరిగిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకల్లో ఎడప్పాడి పళనిస్వామి పాల్గొని ప్రసంగించారు. ఎంజీఆర్, జయలలిత ముఖ్యమంత్రులుగా ఎదుర్కొన్న సమస్యలే వారి తదనంతరం ప్రస్తుతం పార్టీ ఎదుర్కొంటోందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా అన్నాడీఎంకేను రాజకీయాల నుంచి తరిమికొట్టగల సత్తా ఎవరికి లేదన్నారు. పలుమార్లు ప్రభుత్వం ఏర్పాటుచేసిన డీఎంకే కూడా వరుసగా పదేళ్ల కాలం ఓటమి చవిచూసిందని, అలాంటి ఓటమిని చూసిన అన్నాడీఎంకేను మళ్లీ ప్రజలే అధికారంలోకి కూర్చొబెట్టే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ఇప్పటినుంచే సైనికుల్లా పనిచేయాలని ఈపీఎస్ సూచించారు. కార్యక్రమంలో జానకి ఎంజీఆర్ ఫొటో ప్రదర్శనతో పాటు జానకి రామచంద్రన్ చిత్రపటాన్ని ఆయన ఆవిష్కరించారు.

గంగావతరణం.. విలక్షణమైన కోణం!

● డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ





వక్త అశోక్ తేజను సత్కరిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు, డాక్టర్ రాంజీరావు - కార్యక్రమానికి హాజరైన తెలుగు సాహిత్యాభిమానులు

వేళచ్చేరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విష్ణు పాదాల నుంచి ఉద్భవించిన గంగ పవిత్రమయితే, అదే విష్ణు పాదాల నుంచి జనించిన శూద్రులు కూడా పవిత్రమైనవారేనని ప్రముఖ కవి, ఉత్తమ జాతీయ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో టి.నగర్ ఆంధ్రాక్లబ్ గోదావరి హాలులో ఆదివారం సాయంత్రం తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 'శ్రీ శూద్ర గంగ - కావ్యపఠనం' అనే అంశంపై 155వ ప్రసంగ కార్యక్రమం జరిగింది. ఆ కావ్య రచయిత సుద్దాల అశోక్ తేజ వక్తగా పాల్గొని ప్రసంగించారు. వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేశారు. మధుర సుమన ప్రార్థనాగీతం ఆలాపించారు. వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను పరిచయం చేసి పద్యాలను ఆలాపించారు. డా. సుద్దాల అశోక్‌తేజ తెలుగు చలనచిత్ర రంగంలో తనదైన ముద్రతో 3000కు పైగా సందేశాత్మక, జానపద తదితర ఎన్నో గీతాలు రచించారని చెప్పారు. 2000లకు పైగా లలిత గీతాలను కూడా రచించి, పది పుస్తకాలు రచించి పలువురి ప్రశంసలందుకున్నారని తెలిపారు. స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్‌గాను ఎంపికయ్యారని, తన తల్లిదండ్రుల పేరిట ఎన్నో సంస్థలను స్థాపించి సమాజ సేవ చేస్తున్నారని వివరించారు. వక్త అశోక్ తేజ ప్రసంగిస్తూ పురాణాలను మరొక కోణంలో చెప్పడం ఓ వినూత్నమైన విషయమని, కాళోజీ నారాయణరావు, అందె భూమయ వంటివారు ఈ పద్ధతి అనుసరించినవారేనన్నారు. నీళ్లు అవసరం లేని దేవలోకంలో ఉండటం కన్నా నీళ్లు అత్యంత అవసరమైన భూలోకంలో ఉండటమే శ్రేయస్కరమని భావించిన గంగ భూమిలో అవతరించిందని, ఈ ఆలోచనే తన కావ్యానికి శ్రీకారం చుట్టిందన్నారు. 'భూమి అంత గంగకు భూమి అంత ఇష్టం, సురగంగ పేరు కన్న భువి గంగ పేరు ఇష్టం - అంటూ గంగ విశిష్టతను ఆయన వివరించారు.

తను రచించిన శ్రీశూద్రగంగ కావ్యంలో కొంత భాగాన్ని పఠించి వర్ణనాత్మకంగా విపులీకరించారు. గంగావతరణాన్ని విలక్షణ కోణం, వినూత్నంగా రాసిన శ్రీశూద్రగంగ కావ్యంలో గంగ స్వగతాన్ని చెబుతూ 'నింగి నా పుట్టిల్లు, నేల నా మెట్టిల్లు, అన్నదాతల మొదట ఆర్తి తీరుస్తాను, ఆ పైనే గుడుల తీర్థమౌతాను' అని గంగనోట పలికించిన తీరు అమోఘం. చివరగా జేకే రెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

సమాచార దర్శిని

నేటినుంచి టి.నగర్‌లో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ పనగల్ పార్క్ సమీపంలో మెట్రోరైలు పనుల కారణంగా సోమవారం నుంచి డిసెంబరు 1వ తేది వరకు ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ మార్పులు చేపట్టినట్లు నగర ట్రాఫిక్ పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, త్యాగరాయ రోడ్డునుంచి శివజ్ఞానం రోడ్డు మీదుగా వెంకటనారాయణ రోడ్డుకు వాహనాలు అనుమతించరు. ప్రత్యామ్నాయంగా త్యాగరాయ రోడ్డు, తనికాచలం రోడ్డు మీదుగా వెంకటనారాయణ రోడ్డు చేరుకొని వారి గమ్యస్థానాలకు వెళ్లవచ్చు. అదే సమయంలో, స్థానికుల సౌకర్యార్థం, త్యాగరాయ రోడ్డు నుంచి శివజ్ఞానం రోడ్డు మార్గంగా జేవైఎం కల్యాణమండపం వరకు రెండు మార్గాల్లో వాహనాలు అనుమతించనున్నారు. ఈ మార్పులు వాహనచోదకులు గమనించి సహకరించాలని ట్రాఫిక్ పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

'నాన్ ముదల్వన్' పథకంలో డ్రైవింగ్ శిక్షణ

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణా కోర్సులు అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కారు డ్రైవర్ల అవసరం పెరుగుతోంది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించిన ప్రభుత్వం, 45 రోజుల లైట్ వెహికల్, హెవీ వెహికల్, 35 రోజుల ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం రెడ్‌హిల్స్, మరమలైనగర్, తంజావూరులో శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయగా, త్వరలో వాటి సంఖ్య పెంచనుంది. ఈ నేపథ్యంలో, టెన్త్, ప్లస్ టూ, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులై ఉపాధి కోరుకొనే 21 నుంచి 24 ఏళ్లలోపున్న కోటి మందికి ప్రముఖ కంపెనీలతో 12 నెలల ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించంతో పాటు నెలకు రూ.5,000 ప్రోత్సాహం అందిస్తోంది. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించని వారు ఈ శిక్షణక్క చేరేందుకు అర్హులు. మరిన్ని వివరాలకు www.naanmudhalvan.tn.gov.in అనే వెబ్‌సైట్, దరఖాస్తు చేసుకోవడానికి అందులోని QR Code స్కాన్ చేసుకోవచ్చని సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం నుంచి సెంగోట్టై, నాగర్‌కోయిల్ వెళ్లే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా తలా 6 బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తాంబరం-సెంగోట్టై, తాంబరం-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఒక టూ టైర్ ఏసీ బోగీ, రెండు త్రీ టైర్ ఏసీ బోగీలు, రెండు స్లీపర్ క్లాస్, ఒక అన్ రిజర్వ్‌డ్ బోగీ కలుపనున్నారు.. ఈ నెల 27వ తేది నుంచి జనవరి 29వ తేది వరకు ఈ సేవలుంటాయని దక్షిణ రైల్వే తెలిపింది.

నీట్ రాష్ట్రానికి అవసరం లేదు

● స్పీకర్ అప్పావు

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నీట్ రాష్ట్రానికి అవసరం లేదన్న అభిప్రాయం అందరిలో ఉందని అసెంబ్లీ స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. ఆయన ఆదివారం తిరునల్వేలిలో మీడియాతో మాట్లాడుతూ... నీట్ అమలుచేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీచేసిన చట్టాన్ని రద్దు చేయాలని, ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అభిప్రాయం కూడా ఇదేనన్నారు. రాష్ట్రంలో బ్రిటీష్ పాలకుల హయాం నుంచి కొనసాగుతున్న విద్యా సిలబస్‌ను అడ్డుకోవాలని చేసే ప్రయత్నాలు ఫలించబోవన్నారు. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో పొందే మార్కులను బట్టి విద్యార్థులకు ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పించడమే న్యాయమని అప్పావు తెలిపారు.

గ్రూప్-1, 1బీ పరీక్షల్లో బ్లాక్ ఇంక్ మాత్రమే వాడాలి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 1బీ మెయిన్ పరీక్షల్లో అభ్యర్థులు బ్లాక్ ఇంక్ (పాయింట్ పెన్ లేదా బాల్ పాయింట్ పెన్ లేదా జెల్ పెన్) వినియోగించాలి. బ్లాక్ ఇంక్ పెన్ను తప్ప మరేదైనా పెన్ను వాడితే జవాబు పత్రం చెల్లదని టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి... అభ్యర్థులు జవాబుపత్రం అంతటా పరీక్ష నెంబరు రాయడం, మొదటి పేజీలో సంతకం చేయడం, సమాధానాలు రాయడం, చిత్రాలు గీయడం, అండర్‌లైన్ చేయడం, జవాబులు తదితరాలకు నల్ల ఇక్ పెన్ మాత్రమే ఉపయోగించాలి. అభ్యర్థులు అవసరాలకు కోసం ఒకే రకమైన నల్ల ఇంక్ పెన్నులను తగినంత సంఖ్యలో ఉంచుకోవాలి. నల్ల ఇంక్ కాకుండా ఇతర పెన్నులు ఉపయోగించే వారి జవాబు పత్రం చెల్లదని టీఎన్‌పీఎస్సీ పేర్కొంది.

28 నుంచి చదురగిరికి అనుమతి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదురగిరి సుందరమహాలింగం కొండ ఆలయానికి ప్రదోషం, కార్తీక అమావాస్య సందర్భంగా ఈ నెల 28 నుంచి డిసెంబరు 1వ తేది వరకు భక్తులకు ఆలయ నిర్వాహకులు, అటవీ శాఖ అనుమతించింది. భక్తులను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కొండ మార్గం ద్వారా వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకోవచ్చు. రాత్రి వేళల్లో భక్తులు ఆలయంలో బసచేసేందుకు అనుమతి లేదని అటవీ శాఖ స్పష్టం చేసింది.

● అల్పపీడనం ఎఫెక్ట్...

చేపలవేటకు వెళ్లని జాలర్లు



తీరంలో నిలిపిన పడవలు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లాలో ఆరవ రోజు కూడా జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రపు అలలు ఎగసిపడడం, ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసే అవకాశముందని, అందువల్ల జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఆరో రోజు కూడా సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో అక్కరైపేట, కీచాంకుప్పం, కల్లార్, నంబియార్ నగర్, వేదారణ్యం, కోడిక్కరై సహా 25 గ్రామాలకు చెందిన జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు.

గిండీలో స్టార్ హోటల్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని నక్షత్ర హోటల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. శనివారం రాత్రి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. హోటల్ నిర్వాహకుల సమాచారంతో బాంబు స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న గిండీ పోలీసులు, హోటల్, ప్రాంగణాన్ని పరిశీలించి బాంబు బెదిరింపు ఫేక్ అని తేల్చారు. కాగా, ఈ హోటల్‌కు ఈ నెలలో రెండో సారి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు ఈ-మెయిల్ పంపిన వారి చిరునామా కోసం విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులతో వెళ్తున్న వాహనం ఢీకొని విద్యార్థిని మృతిచెందిన ఘటన తంజావూరు జిల్లాలో చోటుచేసుకుంది. తిరువిడైమరుదూర్ తాలూకా తెపెరుమానల్లూర్‌కు చెందిన చిన్నయ్యన్ కుమార్తె మధుసియా (20) శనివారం ఉదయం తన ద్విచక్రవాహనంలో ఇంటి నుంచి కళాశాలకు బయల్దేరింది. ఆ సమయంలో కర్ణాటకకు చెందిన అయ్యప్ప భక్తులు శబరిమల యాత్ర ముగించుకొని, తిరుప్రయాణం అయ్యారు. కుంభకోణం సెట్టి మండపం సమీపంలో వస్తున్న మధుసియా ద్విచక్రవాహనాన్ని అయ్యప్ప భక్తులతో వెళ్తున్న జీపు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో మధుసియా మృతిచెందింది. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి కోసం వివాదం.. వృద్ధుడి హతం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోడి కోసం తలెత్తిన వివాదంలో వృద్ధుడిని హతమార్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కుంభకోణం సమీపం తేనాంబేడు గ్రామానికి చెందిన మురుగయన్ (83) ఇంట్లో కోళ్లు పెంచుతున్నాడు. అతడి పక్కింటిలోని బాబూరాజ్ కూడా కోళ్లు పెంచుకుంటున్నాడు. ఘటన జరిగిన రోజున బాబూరాజ్ కోడి మురుగయన్ ఇంటికి వెళ్లినట్లు సమాచారం. తన కోడిని దొంగిలించి తీసుకుపోయావని బాబూరాజ్, వృద్ధుడైన మురుగయన్‌తో వాగ్వివాదానికి దిగాడు. అది కాస్త ఘర్షణకు దారితీసి బాబూరాజ్, ఆయన సోదరుడు, తల్లి తదితరులు వృద్ధుడిపై దాడిచేయడంతో ఆయన మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి పరారీలో ఉన్న ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

బస్‌షెల్టర్‌ను ఢీకొన్న బస్సు



ప్రమాదం జరిగినప్పటి చిత్రం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సు బస్ షెల్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. అరంతాంగి నుంచి తిరుచ్చికి శనివారం రాత్రి బయల్దేరిన బస్సు, పుదుకోట ఎంజీర్ విగ్రహం సమీపంలో బస్‌షెల్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బస్ షెల్టర్ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పగా, రోడ్డుపై వెళుతున్న ఇద్దరికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, ఘటనపై విచారిస్తున్నారు.

ఎంసీటీబీసీ కోశాధికారి బాబు కన్నుమూత



అనుమలగుర్తి బాబు (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) ట్రెజరర్ అనుమలగుర్తి బాబు (43) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. పులియాన్‌తోపు సమీపంలోని నరసింహ నగర్ ఇంట్లో ఉదయం సుమారు 8 గంటలకు బాబు అకాల మరణం చెందారన్న వార్త తెలిసి ఎంసీటీబీసీ కాపరి రెవ.రాజేంద్రప్రసాద్, సంఘ నిర్వాహకులు, పలు కమిటీల సభ్యులు, నగరంలోని తెలుగు బాప్టిస్టు సంఘాల నిర్వాహకులు ఆయన ఆత్మ శాంతించాలని సంతాపం తెలియజేశారు. బాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తిరుచ్చి సమీపంలో మరో రాకెట్ లాంచర్ లభ్యం



లభ్యమైన రాకెట్ లాంఛర్

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా జీయపురం సమీపంలో రెండు రోజుల క్రితం ఓ జాలరి వలలో మరొక రాకెట్ లాంచర్ చిక్కుకుంది. జిల్లాలోని అందనల్లూర్ శివాలయం సమీపంలోని కావేరి నదీతీరంలో గత నెల 30వ తేది పేలని స్థితిలో రాకెట్ లాంచర్ లభ్యమైన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం లభ్యమైన రాకెట్ కూడా పేలని స్థితిలో ఉంది. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు రాకెట్ లాంచర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ లాంచర్ స్వదేశంలో తయారైనట్లు లేదని, బాంబు స్క్వాడ్ నిపుణుల పరిశీలించిన అనంతరం వివరాలు తెలుస్తాయన్నారు. అదే సమయంలో, ఈ రాకెట్ రాంచర్ ఈ ప్రాంతానికి ఎలా వచ్చిందో అనే విషయమై విచారణ చేపట్టామని తెలిపారు.

పెళ్లయిన మూడునెలలకే ప్రేమ జంట ఆత్మహత్య !



ఆత్మహత్య చేసుకున్న ఉదయప్రకాష్, హేమా (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా ఆదూరుతోప్పు ప్రాంతంలో పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న జంట ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయి మూడు నెలలు దాటక ముందే ఈ జంట జీవితంపై విరక్తి చెంది ఈ దారుణానికి పాల్పడింది. ఆదూరుతోప్పు ప్రాంతానికి చెందిన ఉదయప్రకాష్ (23), నాగపట్టినం జిల్లా నీడూరు వేలాంగన్నికి చెందిన హేమ (21) ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ గురించి తెలుసుకున్న హేమ తల్లిదండ్రులు వ్యతిరేకించారు. దీంతో ఇద్దరూ మూడు నెలల క్రితం వివాహం చేసుకుని కాపురం పెట్టారు. అప్పటి నుంచి హేమ కుటుంబీకులు వీరి వివాహాన్ని వ్యతిరేకిస్తూ పోలీసుల ద్వారా బెదరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఉదయప్రకాష్ నిద్ర లేచినప్పుడు గదిలో హేమ ఉరివేసుకుని కనిపించడంతో దిగ్ర్భాంతి చెందాడు. ఆ దిగులుతోనే అతడు ఇంటి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ దారిలో వారు అది గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పసిపిల్లలను అపహరించి భిక్షమెత్తే ఉత్తరాది మహిళల అరెస్టు



అరెస్టయిన మహిళలు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో పసిపిల్లలను అపహరించి, ఆ బిడ్డలను పస్తులుంచి భిక్షమెత్తే ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి పసిబిడ్డలను స్వాధీనం చేసుకున్నారు. చెన్నై మెరీనాబీచ్ - తాంబరంమార్గంలో వెళ్లే రైళ్లలో ఉత్తరాది రాష్ట్రాల మహిళలు బలహీనంగా ఉండే పసిపిల్లలను చంకనపెట్టుకుని భిక్షమెత్తడం ఆనవాయితీగా మారింది. వీరి వద్దనున్న పసిబిడ్డలు రోజుల తరబడి పస్తులున్నట్లుగా ముఖాలు వాడిపోయి ఉంటాయి. ఇలా భిక్షమెత్తుతున్న మహిళల కదలికలపై రైల్వే పోలీసులు నిఘా వేశారు. ఫలితంగా ముగ్గురు మహిళలు పసిపిల్లలను అపహరించి ఆ బిడ్డలను చంకనపెట్టుకుని భిక్షమెత్తుతున్నట్లు తెలుసుకున్నారు. వెంటనే వారిని అరెస్టు చేశారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు గత వారం రోజుల్లో నగరంలో ఏడుగురు పసిపిల్లలు అపహరణకు గురయ్యారు. వారిని రైల్వే పోలీసులు కాపాడి నగరంలో శిశు సంరక్షణ కేంద్రాలకు తరలించారు.

ఏసీఎస్ పేరవై అధ్యక్షుడికి నివాళి



శివకుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తానికి చెందిన ఏసీఎస్ పేరవై అధ్యక్షుడు శివకుమార్ గత వారం మరణించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పుదియ నీతి పార్టీ స్థాపక అధ్యక్షుడు ఏసీ షణ్ముగం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏసీఎస్ పేరవై జిల్లా సెక్రటరీ శరవణన్, నగర సెక్రటరీ రమేష్, కోశాధికారి కుమరవేల్, ఉపాధ్యక్షుడు ముత్తురామన్ తదితరులు పాల్గొన్నారు.

డాన్‌బాస్కో పాఠశాలలో స్వచ్ఛభారత్‌పై అవగాహన



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో ఆదివారం శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అరుల్‌తండ్రై రాజ మైఖేల్ అధ్యక్షత వహించారు. జిల్లా స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్రన్, సమాజ సేవకుడు డా.నోబల్ విల్లింగ్ స్టన్ తదితరులు విద్యార్థులకు పలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఎన్‌సీసీ తరఫున జరిగిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో స్వాములకు గుర్తింపుకార్డులు

వేళచ్చేరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో ఉంటున్న స్వాములకు గుర్తింపు కార్డులు అందిస్తున్నారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి ఆలయం వెనుక ఉన్న గిరి ప్రదక్షిణ మార్గంలో బసచేస్తున్న స్వాముల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అదే సమయంలో ఈ మార్గంలో నకిలీ స్వాములు గంజాయి సహా పలు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ విషయమై స్పందించిన జిల్లా పోలీసులు స్వాములకు గుర్తింపుకార్డులివ్వాలని నిర్ణయించారు. దానికోసం సుమారు 300 మందికి పైగా స్వాములు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి క్యూఆర్ కోడ్‌తో కూడిన గుర్తింపుకార్డులు అందజేసే కార్యక్రమాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం ఆదివారం నుంచి ప్రారంభించింది.

రేపు విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

వేళచ్చేరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ చట్టం 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేది పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... అన్ని విద్యాసంస్థల్లో మంగళవారం రాజ్యాంగ చట్టం పరిరక్షణ ప్రతిజ్ఞతో పాటు రాజ్యాంగం గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఆ రోజున విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని సీఎం పేర్కొన్నారు.

పళ్లిపట్టులో బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాల్లో బీజేపీ శ్రేణులు

తిరుత్తణి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో పళ్లిపట్టులో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, ప్రజలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుశాల్‌చంద్ జైన్, కిరణ్‌కుమార్, మునియప్ప, మునుస్వామి, వెంకట సుబ్రమణి, రవి, రోహిత్, ఢిల్లీబాబు, శ్రీనివాసన్, గోవిందస్వామి సహా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐల్లో 95 శాతం దాటిన అడ్మిషన్లు

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీఐల్లో అడ్మిషన్లు 95 శాతం దాటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ ఆధీనంలో 102 ప్రభుత్వ 311 ప్రైవేటు వృత్తిశిక్షణా కేంద్రాలున్నాయి. వీటిలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం సెప్టెంబరు 30వతేది వరకు పొడిగించింది. మరోవైపు కొత్త కోర్సులు కూడా ప్రకటించడంతో ఐటీఐల్లో అడ్మిషన్లు 95శాతం దాటాయని, రాబోయే రోజుల్లో 100 శాతానికి పెరిగే అవకాశముందని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిజాయితీ

● చెత్తలో దొరికిన రూ.1.80 లక్షల అప్పగింత



శాంతి, ముత్తిరులాయిలను సత్కరించిన గ్రామస్తులు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెత్తలో లభించిన నగదును యజమానికి తిరిగి అప్పగించిన పారిశుధ్య కార్మికులను గ్రామ సభలో గ్రామస్తులు సత్కరించారు. శివగంగ జిల్లా నాలుకోట గ్రామానికి చెందిన రైతు అర్జునన్ ఇంటి శుభకార్యం కోసం బ్యాంక్ నుంచి రూ.1.80 లక్షలు డ్రా చేసి ఓ గుడ్డ సంచిలో ఉంచాడు. సంచిలో నగదు ఉందని తెలియని కుటుంబ సభ్యులు దానిని చెత్త కుప్పలో వేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించి వెళ్లిన పారిశుధ్య కార్మికులు శాంతి, ముత్తురులాయిలు చెత్త విభజించే సమయంలో బ్యాగులో నగదు గుర్తించి నాలుకోట పంచాయతీ అధ్యక్షుడు ద్వారా అర్జునన్‌కు అందజేశారు. పంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు శాంతి, ముత్తురాలాయిలను సత్కరించడంతో పాటు బహుమతులు అందజేశారు.

రాష్ట్ర పోలీసులను అడ్డుకున్న పుదువై పోలీసులు



మడుకరైలో ఉన్న సారా దుకాణం వద్ద రెండు రాష్ట్రాల పోలీసులు

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొనేందుకు యత్నించిన రాష్ట్ర పోలీసులను పుదుచ్చేరి పోలీసులు అడ్డుకున్నారు. పుదుచ్చేరి రాష్ట్రం మడుకరై ప్రాంతంలో ఆ రాష్ట్ర పోలీసులఅనుమతితో ఆండియార్‌పాళయానికి చెందిన రాజా సారా దుకాణం నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, పట్టంబాక్కం-మడుకరై రోడ్డులో ఉన్న చెక్‌పోస్ట్‌లో డ్యూటీలో ఉన్న రాష్ట్ర పోలీసులు, అటుగా వెళ్లిన ఓ వ్యక్తిని ఆపి అతని లగేజీ తనిఖీ చేసి 10 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని ప్రశ్నించగా మడుకరై ప్రాంతంలో సారా ప్యాకెట్లు కొనుగోలు చేసినట్లు చెప్పడంతో, కడలూరు డీఎస్పీ రూబెన్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం ఉదయం మడుకరై సారా దుకాణానికి వెళ్లి అక్కడున్న 40 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పుదుచ్చేరి నెట్టపాక్కం ఎస్ఐ వీరపుత్రన్ సిబ్బందితో అక్కడకు చేరుకొని రాష్ట్ర పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పుదుచ్చేరి ప్రభుత్వం అనుమతి లేకుండా రాకూడదని చెప్పి రాష్ట్ర పోలీసులను వెనక్కి పంపించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై పుదుచ్చేరి హోంశాఖ మంత్రి నమశ్శివాయం మీడియాతో మాట్లాడుతూ... తమ రాష్ట్రంలో ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న సారా దుకాణాల్లో హద్దు మీరి ప్రవేశించి తమిళనాడు పోలీసులు తనిఖీ చేయడం తప్పన్నారు.

ఏనుగు దాడిలో కారు ధ్వంసం



కారును తొండంతో ఎత్తి పడేస్తున్న ఏనుగు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు సమీపంలోని బీదర్‌గాడ్ అటవీ రేంజ్ పరిధిలో ఏనుగులు మకాం వేశాయి. మూడు రోజుల క్రితం ముక్కట్టి ప్రాంతంలో ఓ ఏనుగు రోడ్డుపై వస్తుండగా, ఆ సమయంలో ఆ మార్గంగా ద్విచక్రవాహనంపై వచ్చిన వారు ఏనుగును చూసి భయపడి వాహనం అక్కడే వదిలి పరుగులు తీశారు. ఆ వాహనాన్ని ఏనుగు తొండంతో ఎత్తి విసిరేసింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి నేలకోట బజార్ ప్రాంతంలో వచ్చిన మరో మగ ఏనుగు, రోడ్డు పక్కనే నిలిపిన కారును తొండంతో ఎత్తి ధ్వంసం చేసింది. ఈ ఏనుగు ఇప్పటికే రెండు కార్లను ధ్వంసం చేసింది. సమాచారం అందుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అటవీశాఖ సహాయ కన్జర్వేటర్ అరుణ్‌మొళి, ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని, ఈ ప్రాంతంలో తిరుగుతున్న రెండు ఏనుగులను అడవుల్లోకి పంపేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఊపందుకున్న ఈత చాపల విక్రయాలు



విక్రయానికి సిద్ధం చేస్తున్న చాపలు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరుప్పులానీ, చిన్నాండి వలసై, పుదుకోయిల్, దీనైకుళం, మోత్తివలస, మేదలోడ తదితర గ్రామాల్లో ఈత ఆకుల చాపల తయారీకి పేరుగాంచాయి. ఈత చెట్ల నుంచి ఆకులు కోసి, వాటితో 6 అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పుతో చాపలు తయారుచేస్తుంటారు. ఒక్కో చాప రూ.40 వరకు విక్రయిస్తారు. ఈ విషయమై చాపల వ్యాపారి సెల్వరాజ్ మాట్లాడుతూ.. తాము తయారుచేసే చాపలను తూత్తుకుడి, కన్నియాకుమారి తదితర ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారన్నారు. ఈ చాపలను చేపలు, పూల మార్కెట్లు, వంట పనుల్లో వినియోగిస్తున్నారని తెలిపారు. ఉప్పు చేపలు, చింతపండు, పూలు తదితరాలు భద్రపరిచేందుకు ఈత చాపలు అధికంగా వినియోస్తారని, ప్లాస్టిక్ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా ఈ చాపల తయారీపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది కుటుంబాలు జీవిస్తున్నాయని సెల్వరాజ్ తెలిపారు.

ఉన్నత విద్యార్హతకు ఎం.ఫిల్ సమానం కాదు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారైకుడి అళగప్ప విశ్వవిద్యాలయంలోని అనధికార వేసవి సిరీస్ ద్వారా అందించే ఎంఫిల్ కోర్సు రెగ్యులర్ ఎంఫిల్ కోర్సుకు సమానం కాదని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రోత్సాహక వేతనాల పెంపు ఉన్నత విద్యార్హత సర్టిఫికెట్లు ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో అళగప్ప వర్సిటీ అందిస్తున్న ఎంఫిల్ కోర్సు ఉన్నత విద్యార్హతకు సమానం కాదని అని జిల్లాల ప్రధాన విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ పంపింది.

కండక్టర్లకు డిజిటల్ టిక్కెట్లపై అవగాహన

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూపీఐ, ఏటీఎం, క్రెడిట్ కార్డుల ద్వారా బస్సు టిక్కెట్లు అందించే పరికరం పనిచేసే విధానంపై కండక్టర్లకు అవగాహనతో పాటు శిక్షణ అందించాలని మెట్రోపాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. ఎంటీసీలో ప్రస్తుతం పరికరం ద్వారా టిక్కెట్లు ఇస్తున్నారు. నగదుతో పాటు ఏటీఎం, క్రెడిట్ కార్డులు వినియోగించి ఈ పరికరం ద్వారా టిక్కెట్లు పొందవచ్చు. ఈ విధానం అమలులోకి వచ్చి 8 నెలలు గడిచినా యూపీఐ విధానంలో టిక్కెట్లు పొందే వారి సంఖ్య తక్కువగా ఉంది. ఈ సంఖ్యను పెంచాలని ఎంటీసీ నిర్ణయించింది. మూడు వారాలు శుక్ర, శనివారాల్లో బ్రాడ్‌వే సహా 20 ప్రధాన బస్టాండ్‌లలో ఈ శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేలూరులో అగర్వాల్ కంటి ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలస రోడ్డులో డా.అగర్వాల్ కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ సుజాత, డా.అగర్వాల్ కంటి ఆస్పత్రి ప్రాంతీయ అధ్యక్షుడు డా.ఐజక్ అబ్రహం అధ్యక్షత వహించారు. స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్ ఈ ఆస్పత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐజక్ అబ్రహం మీడియాతో మాట్లాడుతూ... ఈ ఆస్పత్రిలో 20 మంది వైద్యులు, 150మంది సిబ్బంది ఉన్నారన్నారు. కంటి పొర, కంటి సంబంధిత సమస్యలకు చికిత్స అందిస్తున్నామని, ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేది వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

స్టాలిన్ కార్యక్రమానికి పీఎంకే నేత రాందాస్‌కు ఆహ్వానం

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో ఈ నెల 29న రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరుగనున్న ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు ఆహ్వానం పంపించారు. విల్లుపురంలో కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సామాజిక ఉద్యమకారుల స్మారక మండపం ప్రారంభోత్సవం ఈ నెల 29న జరుగనుంది. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయం కోసం పోరాడే పార్టీల నాయకులను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణిలకు ఆహ్వానాలు పంపటానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ విషయమై మంత్రి పొన్ముడి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారుల స్మారక మండపం ప్రారంభోత్సవానికి రాందాస్‌ను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించినట్లు చెప్పారు. స్టాలిన్ పాల్గొనే కార్యక్రమంలో డాక్టర్ అన్బుమణి రాందాస్ పాల్గొనే అవకాశాలు ఉన్నాయని పీఎంకే వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ కూటమిలో ఉన్న పీఎంకే నేతలను డీఎంకే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం రాబోవు శాసనసభ ఎన్నికల్లో కొత్త చెలిమికోసమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో విగ్రహం తొలగింపు

● నిరసన తెలిపిన 50 మంది అరెస్ట్



వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం ఎల్లీ పుదూర్ ప్రాంతంలోని పొన్నియమ్మన్ ఆలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో కొద్దిరోజులుగా విగ్రహం ఉంచి పూజలు చేస్తున్నారు. ఈ విషయమై అందిన ఫిర్యాదులపై స్పందించిన రెవెన్యూ అధికారులు పోలీసు భద్రత మధ్య ఆదివారం ఉదయం ఆ విగ్రహాన్ని తొలగించారు. అదే సమయంలో విగ్రహాన్ని తొలగించరాదంటూ ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆందోళన చేపట్టిన సుమారు 50 మందిని పోలీసులు అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.

'ముఫాసా'కు అర్జున్ దాస్ గాత్రం



అర్జున్ దాస్

ప్రతి ఒక్కరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'ముఫాసా'. డిస్నీ నిర్మాణ సంస్థ తెరకెక్కించింది. ఈ చిత్రం తమిళ వెర్షన్‌కు నటులు అశోక్ సెల్వన్, రోబో శంకర్, సింగంపులి, వీటీవీ గణేష్, నాజర్ డబ్బింగ్ చెప్పగా, ఇపుడు మరో ప్రముఖ హీరో అర్జున్ దాస్ కూడా గాత్రదానం చేశారు. బేరీ జెంకిన్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వచ్చే నెల 20వ తేదీన తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయనున్నారు. 2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఇపుడు 'ముఫాసా' పేరుతో ప్రేక్షకులను అలరించేలా ఈ అద్భుతమైన ప్రాజెక్టును రూపొందించారు. ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రకు అర్జున్ దాస్ డబ్బింగ్ చెప్పారు. దీనిపై ఆయన స్పందిస్తూ, 'ముఫాసా'లో భాగం కావడం 'ది లయన్ కింగ్' కల నిజమైంది. మన చిన్ననాటి జ్ఞాపకాలన్నింటిలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగివున్న ఐకానిక్ పాత్రకు గాత్రదానం చేయడం గౌరవంగా భావిస్తున్నాను. చిన్నపుడు లయన్ కింగ్‌ను చూడటం గుర్తుంది. ముఫాసాను తమిళ ప్రేక్షకులు కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. డిస్నీ ప్రాజెక్టులో భాగస్వామ్యం కావడం అంటే జీవితంలో ఒకే ఒక్కసారి లభించే అరుదైన అవకాశం' అన్నారు.

యువత ప్రేమ మూడ్‌లో ఉంటే యాక్షన్ చిత్రాలు తీస్తున్నాం : హీరో కార్తీ

● 'మిస్ యూ' ట్రైలర్ రిలీజ్

నేటి యువత లవ్ మూడ్‌లో ఉంటే మనం మాత్రం యాక్షన్ చిత్రాలను తీస్తున్నామని హీరో కార్తీ అన్నారు. ప్రేమ కథా చిత్రాలకు మంచి ఆదరణ ఉన్నప్పటికీ ఎవరూ ఆ తరహా చిత్రాలను తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధార్థ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మిస్ యూ'. తమిళం, తెలుగు భాషల్లో ఈ నెల 29న విడుదలకానున్న నేపథ్యంలో శనివారం నగరంలో ఆడియో, ట్రైలర్ కార్తీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కార్తీ మాట్లాడుతూ, 'ఈ టైటిల్ ప్రతి ఒక్కరూ ఉపయోగించే పదం. సోషల్ మీడియాలో యువత చేసే పోస్టులన్నీ లవ్ పోస్టులే ఉంటాయి. కానీ, మనం లవ్ చిత్రాలు తీయడం లేదు. యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్ చిత్రాలనే తీస్తున్నాం. ఈ ట్రెండ్ మారాలి. ఆయా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా, యువత అభిరుచికి తగినవిధంగా చిత్రాలు నిర్మించాలి' అని కోరారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'గతంలో అనేక ప్రేమ కథా చిత్రాలు వచ్చాయి. అనేక మంది హీరోలు ఈ తరహా చిత్రాలను నిర్మించారు. ఈ చిత్రం వాటన్నింటికంటే కొత్తగా ఉండాలని భావించాం. అలా ఉండటం వల్లే ఈ కథ చేసేందుకు అంగీకరించాను. 'చిత్తా' నాకు మంచి సక్సెస్‌ను ఇచ్చింది. అయినప్పటికీ మంచి కథ కోసం వెయిట్ చేసి ఈ సినిమాను చేశాను. మనమంటే ఇష్టంలేని ఒక యువతికి ఐ లవ్ చెప్పడం ఎలా అన్నదే ఈ చిత్ర కథ. నేటి ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందించాం' అని పేర్కొన్నారు. 7 మైల్స్ పర్ సెకండ్ పతాకంపై సామువేల్ మ్యాథ్యూ నిర్మాణ సారథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించగా, ఎన్ రాజశేఖర్ దర్శకత్వం వహించారు. జేపీ, పొన్‌వణ్ణన్, కరుణాకరన్, నరేన్, అనుపమ కుమార్, రమ, బాలశరవణన్, లొల్లు సభ తదితరులు నటించారు.



'మిస్ యూ' ట్రైలర్ రిలీజ్ వేడుకలో కార్తీ, సిద్ధార్థ్

హరీష్ కళ్యాణ్ సరసన ప్రీతి

'స్టార్' చిత్రంలో నటించిన ప్రీతి ముకుందన్‌కు మరో లక్కీ ఛాన్స్ లభించింది. 'పార్కింగ్', 'లబ్బర్ పందు' వంటి వరుస హిట్ చిత్రాల్లో నటించిన హీరో హరీష్ కళ్యాణ్ సరసన నటించే మంచి అవకాశాన్ని దక్కించుకుంది. హరీష్ కళ్యాణ్ సరసన నటించనున్నట్టు ఆమె వెల్లడించారు. ఇటీవల ప్రీతి ముకుందన్ చేసిన 'ఆసై కూడా' అనే ప్రైవేట్ ఆల్బమ్ కూడా ప్రేక్షకాదారణ లభించిన విషయం తెల్సిందే. మరోవైపు, హరీష్ కళ్యాణ్ కూడా మంచి కథలను ఎంచుకుంటూ తన కెరీర్ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం 'నూరు కోడి వానవిల్, 'డీజల్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఇవికాకుండా, 'లిఫ్ట్' ఫేం వినీత్ వరప్రసాద్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు.



ప్రీతి ముకుందన్

చిత్రజ్యోతి

సినిమాలను విమర్శించే హక్కు అందరికీ వుంది : ఆర్జే బాలాజీ

ఒక చిత్రాన్ని ఎవరైనా విమర్శించే హక్కు ఉందని, కానీ, ఆ చిత్ర కంటెంట్ బాగుంటే ప్రేక్షకుల చెంతకు వెళ్ళడాన్ని ఏ ఒక్కరూ ఆపలేరని హీరో, దర్శకుడు ఆర్జే బాలాజీ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'సొర్గవాసల్'. 29న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ ఈవెంట్ శనివారం రాత్రి నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ట్రైలర్ రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా ఆర్జే బాలాజీ మాట్లాడుతూ, 'ఈ చిత్ర బృందంతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషం. ఇప్పటివరకు నేను సినిమా చూడలేదు. దీనికి కారణం.. యూనిట్‌లపై ఉన్న నమ్మకం. సినిమా చూసిన వారు చాలా బాగుందంటూ ప్రశంసించారు. కంటెంట్ బాగుంటే ప్రేక్షకుల దగ్గరకు వెళ్తుంది. సినిమా విడుదలైన తర్వాత ఆ చిత్రం బాగుందా లేదా అన్నది ప్రేక్షకులు డిసైడ్ చేస్తారు. ఎవరెన్ని రకాలుగా కామెంట్స్ చేసినా అంతిమ నిర్ణయం ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది' అన్నారు. దర్శకుడు పా.రంజిత్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన సిద్ధార్థ్ విశ్వనాథ్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్జే బాలాజీ సరసన సానియ అయ్యప్పన్ హీరోయిన్. బాలాజీ శక్తివేల్, సెల్వరాఘవన్, కరుణాస్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు.



ట్రైలర్ రిలీజ్ చేస్తున్న దృశ్యం

● ఎన్‌సీసీ దినోత్సవం...

యుద్ధ స్మారక స్థూపం వద్ద నివాళి



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ కణబీర్‌సింగ్ బ్రార్

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా కామరాజర్ రోడ్డు సమీపంలో సైనిక వీరుల స్మారక స్థూపం వద్ద ఆదివారం నివాళులర్పించారు. ప్రపంచంలో అతిపెద్దదైన ఎన్‌సీసీ 1948 నవంబరు 24న స్థాపించారు. ప్రస్తుతం ఎన్‌సీసీ 76వ వార్షికోత్సవం జరుపుకుంటున్నారు. మెరీనా సైనిక స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రక్షణ శాఖ దక్షిణ ప్రాంత కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ కణబీర్‌సింగ్ బ్రార్ ప్రత్యేక అతిథిగా పాల్గొని, సైనిక బ్యాండ్ మధ్య అంజలి ఘటించారు. తొలుత లెఫ్టినెంట్ జనరల్ కణబీర్‌సింగ్‌కు తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ తదితరాలతో కూడిన ఎన్‌సీసీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.రాఘవ్ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ 13వ బెటాలియన్‌కు చెందిన క్యాడెట్ల బృందం మార్చ్ ఫాస్ట్ నిర్వహించింది.

ప్రకృతి వైద్యంపై సదస్సు



సదస్సు నిర్వాహకులతో స్పీకర్ అప్పావు

వేళచ్చేరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైద్యం వేడుకల్లో భాగంగా రోటరీ డిస్ట్రిక్ట్ 3233 ఆధ్వర్యంలో ఎగ్మూర్‌లోని రాజారత్నం స్టేడియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలకు ప్రకృతి వైద్యంపై అవగాహన, పరీక్షలు, ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ అప్పావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 3,000 మంది రోటరీ లోగో, ప్రకృతి వైద్యం (నాచురోపతి) తెలిపేలా 'ఎన్' అనే అక్షర నమూనాలో నిలబడి వోనా వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. ఆయా సంస్థల నిర్వాహకులు సాధన సర్టిఫికెట్లను నిర్వాహకులకు అందజేశారు.

రూ.427 కోట్లతో తిరుమళిసై బస్‌స్టేషన్

● మార్చిలో ప్రారంభోత్సవం ?



తిరుమళిసై బస్‌స్టేషన్ భవనం - తిరుమళిసై బస్‌స్టేషన్ నమూనా చిత్రం

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పూందమల్లి సమీపం తిరుమళిసై వద్ద రూ.427 కోట్లతో సకల సదుపాయాలతో కొత్త బస్‌స్టేషన్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ బస్‌స్టేషన్‌ను వచ్చే యేడాది మార్చిలోగా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. నగరంలో వాహనాల రద్దీ సహా సుదూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సుల రద్దీని తగ్గించడం కోసం ప్రస్తుతమున్న కోయంబేడు బస్‌స్టేషన్‌తోపాటు మాధవరం బస్‌స్టేషన్ కూడా నిర్మించారు. ఆ రెండు బస్‌స్టేషన్లు పూర్తి స్థాయిలో పనిచేసినా తాంబరం - పెరుంగళత్తూరు మార్గంలో దక్షిణాది జిల్లా కేంద్రాలకు వెళ్లే బస్సుల రాకపోకలు అధికం కావటంతో ఆ మార్గంలో తరచూ ట్రాఫిక్‌జాం అయ్యేది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కిలాంబాక్కం వద్ద బస్‌స్టేషన్ నిర్మించారు.



బస్సులు నిలిచే ప్రాంతం

ప్రస్తుతం ఆ బస్‌స్టేషన్‌లో వాహనాల రాకపోకలు పెరిగాయి. మదురై, కన్నియాకుమారి, రామనాథపురం తిరుచ్చి, కోయంబత్తూరు తదితర నగరాలకు వెళ్లే బస్సులు కిలాంబాక్కం బస్‌స్టేషన్ నుంచి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల వైపు బస్సులు మాధవరం బస్‌స్టేషన్ నుంచి నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో కేరళ, కర్నాటక రాష్ట్రాల వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను తిరుమళిసై సమీపం కుత్తుంబాక్కం నుంచి నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాల వైపు వెళ్లే బస్సులు కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి నడుపుతున్నారు. ఈ బస్సులను తిరుమళిసై బస్‌స్టేషన్ నుంచి నడిపితే కోయంబేడు ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సుల కోసం ఏర్పాటు చేసిన బస్‌స్టేషన్ పూర్తిగా ఖాళీ అవుతుంది. కర్టాటక, కేరళ వైపు నడిచే బస్సుల కోసం తిరుమళిసై శాటిలైట్ సిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 24.8 ఎకరాల్లో బస్‌స్టేషన్ నిర్మాణ పనులు 2021 ఫిబ్రవరిలో ప్రారంభమయ్యాయి. బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫామ్‌లు, మరుగుదొడ్లు, రవాణి సిబ్బంది రెస్ట్‌రూమ్‌లు తదితర సదుపాయాలతో రూ.427 కోట్లతో ఈ పనులు చురుకుగా కొనసాగాయి. ఈ కొత్త బస్‌స్టేషన్‌ను రెండంతస్థులతో 70 సబర్బన్ బస్సులు, 30 ఆమ్నీ బస్సులు, 36 సిటీ బస్సులు వచ్చి వెళ్లేలా నిర్మిస్తున్నారు. ఇవిగాక 48 సబర్బన్ బస్సులు, 27ఆమ్నీ బస్సులు ఇలా మొత్తం 163 బస్సులు నిలిచేలా నిర్మిస్తున్నారు. ఈ బస్‌స్టేషన్ దిగువ దళంలో 1800 ద్విచక్రవాహనాలు, 235 కార్లు, వ్యానులు నిలిచేలా రెండంతస్థుల పార్కింగ్ ఏరియా కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకూ 85 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా 15 శాతం పనులు మూడు నెలల్లోగా పూర్తవుతాయని సీఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు. అన్ని హంగులు సంతరించుకుని మార్చిలో ఈ బస్‌స్టేషన్ ప్రారంభమవుతుందని చెప్పారు.

కలాం స్మారక స్థలంలో కవిసమ్మేళనం

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవుల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రామేశ్వరంలోని మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం స్మారక స్థలంలో శనివారం సాయంత్రం కవిసమ్మేళనం నిర్వహించారు. కవితల ద్వారా ప్రపచమంతా ఐకమత్యం సాధించే దిశగా మదురైలో ప్రపంచ తమిళ సంఘంలోని ప్రపంచ కవులు కాంగ్రెస్ 43వ అంతర్జాతీయ మహానాడు గురువారం ప్రారంభమైంది. ఆ మహానాడు కొనసాగింపులో భాగంగా రామేశ్వరం, కారైకుడిలో ప్రపంచ కవుల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కవిసమ్మేళనాలు నిర్వహించారు. రామేశ్వరంలో కలాం స్మారక స్థలంలో నిర్వహించిన కవిసమ్మేళనంలో ప్రపంచ కవుల కాంగ్రెస్ అధ్యక్షురాలు మరియా యూజీనియా సోఫ్రానీస్ అధ్యక్షత వహించారు. రామనాథపురం ఎంపీ నవాజ్ ఘనీ, కలాం సోదరుడి కుమార్తె నజిమా మరైకాయర్, మనవడు షేక్ సలీం, ప్రముఖ కవి ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు

ఘనంగా మాజీ సీఎం జానకి శతజయంతి వేడుకలు

● సీనియర్ నటీమణులకు సత్కారం



ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి మహిళా ముఖ్యమంత్రి, మాజీ సీఎం ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలను అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వానగరంలో ఉన్న శ్రీవారు వెంకటాచలపతి ప్యాలెస్ కల్యాణ మండపంలో జ్యోతి వెలిగించి ఈ వేడుకలను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రారంభించారు. అనంతరం వేదికపై పూలతో అలంకరించిన మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, జానకిల చిత్రపటాలకు నివాళులర్పించారు. శతజయంతి వేడుకల సావనీర్‌ను ఆవిష్కరించి తమిళ సినీరంగంలో జానకితో కలసి పనిచేసిన సీనియర్ నటీమణులు వెన్నిరాడై నిర్మల, సచ్చు, కుట్టి పద్మిని, రాజశ్రీలకు దుశ్శాలువ కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. అన్నాడీఎంకే చరిత్ర, జానకి జీవిత చరిత్రలపై రూపొందించిన డాక్యుమెంటరీని వేదిక ప్రాంగణంలో పెద్ద స్క్రీన్లపై ప్రదర్శించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్ మగన్ హుస్సేన్, కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, మాజీ మంత్రులు సీ. పొన్నయ్యన్, వలర్మతి, గోకుల ఇందిరా, డాక్టర్ సి. విజయభాస్కర్ కేసీ మురుస్వామి, నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి, తంగమణి, దళవాయి సుందరం, కడంబూర్ రాజు, పి.బెంజిమెన్, అబ్దుల్ రహీమ్, నటి గౌతమి, ఎంజీఆర్ మండ్రం యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ సహా పలువురు నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన కోసం ఊటీ ముస్తాబు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఊటీకి రానుండటంతో ఆ పర్యాటక నగరంలో కొత్త రహదారి నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. తిరువారూరులోని సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం, కున్నూరు వెలింగ్టన్ సైనిక శిక్షణ కళాశాలలో సైనికాధికారులతో భేటీ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆమె ఈ నెల 27న ఢిల్లీ నుంచి బయలుదేరి కోయంబత్తూరు సూలురు వైమానిక దళం విమానాశ్రయంలో దిగనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఆమె ఊటీ చేరుకుని అక్కడి రాజ్‌భవన్‌లో రాత్రి బసచేస్తారు. ఈ నెల 28న కున్నూరు వెలింగ్టన్ సైనిక శిక్షణా కళాశాల కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ రోజు రాత్రికూడా ఊటీలోనే బసచేస్తారు. ఈ నెల 29న ఊటీలో గిరిజనులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నెల 30 హెలికాప్టర్‌లో కోయంబత్తూరు చేరుకుని అక్కడి నుంచి తిరువారూరు వెళ్ళి సెంట్రల్ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పాల్గొని ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రాష్ట్రపతి మూడు రోజులపాటు ఊటీలో బసచేయనుండటంతో ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న రహదారులను ప్రజాపనుల శాఖ అధికారులు మరమ్మతు చేస్తున్నారు. రాష్ట్రపతి రోడ్డు మార్గంలో పర్యటించనున్న మార్గాలన్నీ ప్రస్తుతం కొత్త రూపు సంతరించుకోనున్నాయి.



ఊటీలో కొత్త రోడ్డు వేస్తున్న కార్మికులు



కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద స్నానమాచరిస్తున్న అయ్యప్ప భక్తులు

కుట్రాలంలో అయ్యప్ప భక్తుల సందడి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద గత రెండు రోజులుగా శబరిమలై వెళ్లే భక్తుల సందడి అధికమైంది. కుట్రాలం పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులుగా తరచూ జల్లులు పడుతుండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం నుంచి జలపాతాల వద్ద అయ్యప్పభక్తులు స్నానాలు చేస్తున్నారు. కుట్రాలం జలపాతాల్లో స్నానమాచరించి, అక్కడి కుట్రాలనాథర్ ఆలయాన్ని, తెన్‌కాశి కాశీ విశ్వనాథర్ ఆలయాన్ని దర్శించిన తర్వాతే శబరిమలై పయనమవుతున్నారు. కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద ఆదివారం ఉదయం నుండే అయ్యప్ప భక్తుల రద్దీ అధికమైంది.